# "అబద్ధం ఆడను"

"అబద్ధం ఆడటమంత నీచం ప్రపంచంలో మరొకటిలేదు. అసలు అబద్ధం ఆడాల్సిన గతి ఏం పట్టింది? ఏదన్నా తప్పు చేస్తేగా అబద్ధం ఆడవలసింది? అసలు తప్పు ఎందుకు చేయాలి? తప్పు చేశావనుకో, అబద్ధం ఎందుకు ఆడాలి? నిజం చెప్పి తను చేసిన తప్పుకు న్యాయంగా తనకు రావలసిన శిక్ష అనుభవించటంలో తలవంపులు ఎందుకు?" అన్నాడు జగన్నాథం తన మిత్రుల నుద్దేశించి.

"అదేమిట్రా ప్రాణాపాయంగాని మరేదయినా వచ్చిందనుకో అబద్ధం ఆడక ఏం చేస్తావు?" అన్నాడు సూర్యనారాయణ.

"అసలు ప్రాణాపాయం వచ్చే పనులు ఎందుకు చేయాలి? అంతమాత్రం ఒళ్లు దగ్గిర పెట్టుకో నక్కర్లేదా?"

"సరేలే నీ తెలివి. పొరపాట్లు మానవ సహజం. 'పొరపాట్లు మానవులకు గాక మానుల కొస్తాయా?' అన్నాడు."

దీనికి సమాధానంగా జగన్నాథం ఏదో చెప్పబోతున్నాడు. ఇంతసేపు అక్కడే కూర్చుని వాళ్ల సంభాషణ విని విసుగెత్తిన శర్మ "పదండ్రా బాబూ, మీ సంభాషణ వినలేక చస్తున్నాను. సినిమా కెళ్దాం రండి. మల్లీశ్వరి రెండోసారి 'రిలీజ్' అయిందిట." అన్నాడు.

ముగ్గురూ సినిమాకు బయలుదేరారు.

సినిమానుంచి వస్తూకూడ జగన్నాథం "నేనుమటుకు చచ్చినా అబద్ధం ఆడదల్చుకోలేదు. అంత ఖర్మం ఏం పట్టింది? పొరపాటునయినా సరే, కలలో అయినా సరే అబద్ధం ఆడను" అన్నాడు జగన్నాథం.

"ఎప్పుడో ఒకప్పుడు అబద్ధం ఆడక తప్పదు లేరా. అందులో ఇది కలికాలం. 'కలికాలం అబద్ధాలకు మూలం' అన్నాడొకడు" అన్నాడు సూర్యనారాయణ.

* * *

సూర్యనారాయణ, జగన్నాథం, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. శర్మ హైస్కూలులో ఇంగ్లీషు టీచరుగా వుంటున్నాడు. ముగ్గురు ఎప్పుడూ కలిసి మెలిసి అన్నదమ్ముల్లా వుంటారు.

జగన్నాథం ఉబుసుపోక ఉద్యోగం చేస్తున్నాడు. అదీ పురుషలక్షణం అని అన్నారు కాబట్టి చేస్తున్నాడు. సూర్యనారాయణ అలా కాదు. జగన్నాథంలాగా ఇతని కేమీ ఆస్తి లేదు. జగన్నాథానికి తాతలు సంపాదించిన లక్ష రూపాయల ఆస్తి వుంది. సూర్యనారాయణ తన రెక్కల మీదే ఆధారపడాలి. సూర్యనారాయణ సంపాదనపైనే ఇంటిల్లిపాదీ ఆధారపడి వున్నారు. అతని ఇంట్లో జనాభా కూడ తక్కువేం గాదు. కీళ్ళవాతంతో లేవలేని తండ్రి, తల్లి, భార్య, చెల్లెలు, తమ్ముడు. దేవుడు దయతలిచి అతనికి యింతవరకు సంతానం యివ్వలేదు గాని లేకపోతే ప్రపంచధర్మం ప్రకారం నలుగురన్నా పుట్టి వుండాలి యిప్పటికి. చెల్లెలి పెళ్లి కూడ సూర్యనారాయణే చేయాలి. ఆమె స్కూల్ ఫైనల్ చదువుతున్నది. అది కాగానే చేద్దాం అనుకొంటున్నాడు. చెల్లెలి పెళ్లి

## వేమూరి సుబ్రహ్మణ్యం

చేయాలంటే వున్న యిల్లు ఒక్కటీ అమ్మటమో, తాకట్టు పెట్టటమో జరగాలి .. ఇంతకూ చెప్పొచ్చే దేమిటంటే అతని సంపాదనే ఆ యింటిమనుగడకు ఆధారం...

సూర్యనారాయణ కేవలం తనకు వచ్చే జీతంతో వీళ్ళని పోషిస్తున్నాడా? అంటే అది శుద్ధ అబద్ధం. కొస్తో కూస్తో వీలున్నప్పుడల్లా పై, పై, సంపాదనకు వెనుకాడడు. దీనిలో అతనికి తప్పు కనబడలేదు. అవును మరి తనబోటివాడు అంతకంటె ఏమి చేయగలడు. తానూ ఏ 'జగం'లాగో పుట్టివుంటే, అసలు ఉద్యోగమే చేసేవాడుగాదు. తాను జగం కాక సూర్యం గనుకనే స్కూల్ ఫైనల్ అయినవెంటనే, కాలేజీలో చేరాలని ఎంత కుతూహలపడ్డా వీలులేక ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. కుటుంబపోషణకోసం పై సంపాదనకు చేతులుచాచినా తప్పులేదు - అని తనకు తానే సమర్థించుకొనేవాడు మనస్సులో.

ఒకటిమాత్రం నిజం. సూర్యనారాయణకు 'ఈ పైసంపాదనలో' అనుభవమూ, తెలివితేటలూ తక్కువ కాకపోతే ఐదేళ్ళనుంచి వుద్యోగం చేస్తూ, చెల్లెలిపెళ్లికోసం ఇల్లు తాకట్టు పెట్టాల్సిన ఖర్మం ఏంపట్టింది? ఎప్పుడూ మంచి పేంటూ, చొక్కా లేకుండా ఆఫీసుకు పోవాల్సినగతి ఎందుకు? పైసంపాదన అని పేరేగాని అతడు నెలకు ఇరవై, పాతికకంటె ఎక్కువ సంపాదించ లేదు...

ఆరోజు సూర్యనారాయణ ఆఫీసులో ఏవో అవసరమైన కాగితాలు చూచుకొంటున్నాడు. అవేవో అర్జెంటు కాగితాలు కనుక తలెత్తకుండా పనిచేసుకొంటున్నాడు.

"మాస్టారూ' అన్న పిలుపు విని తలెత్తి చూశాడు. తెల్లటిలాల్చీ, తెల్లటిపంచె, కళ్ళజోడు పెట్టుకొని, జుట్టు పైకి ఎగదువ్వుకుని ఒకాయన నుంచొని ఉన్నాడు.

"ఏం కావాలండీ" అని అడిగాడు సూర్యనారాయణ.

"చూడండి! ఈపని కాస్త త్వరగా అయ్యేటట్లు చూడండి" అని ఒక కాగితం సూర్యనారాయణ చేతి కిచ్చాడు.

అదేదో అప్లికేషన్ "అబ్బే ఇప్పుడు వీల్లేదండీ తొందరపనిలో వున్నాను" అన్నాడు సూర్యం. నిజానికి అతను తొందరపనిలోనే వున్నాడు.

"అబ్బే, అది కాదండి. యీపని అవటానికోసరం నాకు కాస్త డబ్బు ఖర్చు అయినా ఫరవాలేదు" అని ఆ పెద్దమనిషి వందరూపాయల నోటు జేబులోంచి తీశాడు.

వందరూపాయల నోటు! సూర్యం కళ్లు జిగేలుమన్నయ్. అది తన జీతంకన్నా కూడ ఎక్కువ. వందరూపాయలతో ఎన్ని పనులు చేయవచ్చు!... ఇంతకన్నా ఆలోచించలేకపోయాడు సూర్యం.

"సరే కాగితం యిచ్చి సాయంత్రం రండి" అన్నాడు సూర్యం.

ఆయన నవ్వుతూ "అలాగే నండి" అని ఆ కాగితంతోపాటు వందరూపాయల నోటు కూడ యిచ్చాడు. చేతులు వణుకుతూ ఉంటే సూర్యం అది తీసుకొని పక్కకు చూచేడు. జగన్నాథం చిరునవ్వు నవ్వాడు, పక్కసీటులో కూర్చుని.

* * *

"ఇప్పుడేంగరా? ఆ పెద్దమనిషి ఇంత పని చేస్తాడనుకోలేదు. ఏదో పెద్దమనిషిలాగా వున్నాడుగదా అని వందరూపాయలు తీసుకొంటే, ఈమాత్రానికే ఆయన రిపోర్టు చెయ్యాలా? కావాలంటే వంద రూపాయలు తల తాకట్టుపెట్టి అయినా యిచ్చేవాడిని గాదూ?..." అన్నాడు సూర్యం బాధగా, విచారంగా. అక్కడ

వున్న మిగతా యిద్దరూ అతనికి సానుభూతి చూపారు.

"పైగా యిదొకటి. ఆయన నన్నే సాక్ష్యం వేసుకోవాలా. ఇంకెవరూ దొరకలా?" అన్నాడు జగన్నాథం.

"అదేమిట్రా అట్లా అంటావ్? అదీ మన మంచికేలేరా! నువ్వు టకాయించి చెప్పెయ్యొచ్చు. అసలు సూర్యం నిరాకరించాడనీ, ఆయనే బలవంతంచేసి యివ్వబోయాడనీ, చివరికి సూర్యం తీసుకోలేదనీ, ఢంకామీద దెబ్బకొట్టి మరీ చెప్పు" అన్నాడు శర్మ.

"అదెట్లాగరా? సూర్యం తీసుకోవటం నేను కళ్ళారా చూశానుగా? అబద్ధం ఎట్లా చెప్పేదిరా?" అన్నాడు జగన్నాథం.

"వాడు మాత్రం తీసుకొన్నాడనే మొత్తుకొంటున్నాడుగా. వాడి జీవనోపాధి కోసరమన్నా నువ్వు అబద్ధం ఆడక తప్పదురా. మిత్రుడివై వుండి ఈమాత్రం సహాయం చేయకపోతే ఎట్లారా?"

"జగం, ఈసారికి రక్షించరా. బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడూ లంచం తీసుకోను, ప్రాణం పోయినా" జాలిగా అన్నాడు సూర్యం.

జగన్నాథం కాసేపు మౌనం వహించాడు. చివరికి "పోనీలేరా. విచారణ జరుగుతుంది. ఫైన్ వేస్తారు. అంతేనా? ఫైన్ ఎంతయినా సరే నేను కడతానులే. చూస్తూ, చూస్తూ అబద్ధం ఎట్లా ఆడేదిరా" అన్నాడు.

శర్మకు ఒళ్లు మండింది. "అబద్ధం ఎట్లా ఆడేదిరా? అబద్ధం ఎట్లా చెప్పేదిరా? అని మాటిమాటికీ అంటున్నావు. అబద్ధం చెప్పకుండానే మీ పూర్వులు యింత ఆస్తి సంపాదించారా? అది నువ్వు అనుభవించటం లేదూ? ఇప్పుడు ఆప్తమిత్రుడికి ఆపద వచ్చిందనేగా నిన్ను అడుక్కోమంటున్నది? అబద్ధం చెప్పనంటే ఎట్లా?" అని దురుసుగా అన్నాడు.

"శర్మా. నువ్వూరుకోరా. జగం! ఫైన్ వేయకుండా ఉద్యోగం తీసివేస్తే..." అన్నాడు సూర్యం దీనంగా.

"ఉద్యోగంలోంచి తీసేస్తారా!... అబ్బే అటువంటిది జరగదులేరా. రెండేళ్ళ క్రిందట ఏమయింది? నాగేశానికి ఐదు వందలు ఫైనువేసి వదలలేదూ?" అన్నాడు జగన్నాథం.

"అయితే నువ్వు అబద్ధం ఆడవన్నమాట! ఒరే జగం మిత్రుడి సంగతి ఆలోచించరా." అన్నాడు శర్మ బ్రతిమలాడుతూ.

"జగం! గట్టిగా ఆలోచించరా. నీకు అయితే ఉద్యోగంపోతే యింట్లో కూర్చుని తింటావ్. కాని నా విషయం అలా కాదు. ఆలోచించు! ఈ ఉద్యోగంపోతే యింటిల్లిపాదీ నడిబజార్లో పడతారు." అన్నాడు సూర్యం, విచారంగా.

జగన్నాథం మౌనం వహించేడు.

మౌనం అంగీకారం అనుకొన్నారు మిత్రులు.

* * *

ఆఫీసరు విచారణ కొచ్చాడు.

సూర్యం కంపించిపోతున్నాడు...జగం ఏంచేస్తాడో...ఆఫీసరు సూర్యాన్ని అడిగాడు. తాను తీసికోలేదని తెగేసి చెప్పాడు సూర్యం. ఆఫీసరు జగాన్ని అడిగాడు. "ఏమయ్యా. ఈయన నువ్వు చూశావని చెబుతున్నాడే? చూశావా?"

సూర్యం జగంవంక ఒక్క చూపు చూసి తలదించేసుకొన్నాడు. సూర్యం చెవులు ఆతురతతో వింటున్నయ్.

"నేను చూశానండి." అని చెప్పాడు జగం.

ఆఫీసరు వెళ్లిపోయాడు.

సూర్యం ఒక్కసారిగా కూలపడ్డాడు. జగన్నాథం సూర్యందగ్గరికి వచ్చాడు. "క్షమించు బ్రదర్. అబద్ధం ఆడలేను. ఎంత ఫైను అయినా సరే నేను కడతాను." అని జేబులోంచి నోట్లకట్ట తీశాడు.

సూర్యం ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో ప్యూనువచ్చి ఒక కాగితం సూర్యం చేతికిచ్చి వెళ్లాడు. సూర్యం చేతులు వణుకుతుండగా కాగితంతీసి చూశాడు... అతన్ని బర్తరఫ్ చేస్తూ వచ్చిన ఆర్డర్!...

కాగితం చదివి నిర్ఘాంతపొయ్యాడు జగన్నాథం. ఇదేమిటి? ఇట్లా జరిగింది? తానొకటి తలిస్తే వేరొకటి అయిందే? ఛీ! ఛీ!! నేనెటువంటి పని చేశాను? చేతులారా ఒకడి ఉద్యోగం పోగొట్టానే అని కుమిలిపొయ్యాడు.

"క్షమించు బ్రదర్. అపరాధం క్రింద ఇవి తీసుకో" అని నోట్లకట్ట సూర్యం ఒడిలో వుంచాడు.

నోట్లకట్టను అతనిమీద విసరికొట్టి సూర్యం మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

జగన్నాథం అపరాధాన్ని సూర్యం, శర్మ క్షమించలేకపొయ్యారు. అవును మరి, క్షమించదగ్గ అపరాధమేనా అది? వాళ్ళిద్దరూ అతనితో మాట్లాడటం మానివేశారు. జగన్నాథమే రెండుసార్లు పలుకరించబోయినా మాట్లాడలేదు. జగన్నాథానికి భరించరానంత బాధ కలిగింది. ఆప్తులు తన తప్పును క్షమించలేకపోతే ప్రపంచంలో అంతకన్న బాధ మరొకటి ఏముంటుంది?

ఇటువంటి బాధ భరించలేక ఆఫీసుకు మూడు నెలలు శెలవు పెట్టి దేశాంతరం బయలుదేరాడు జగన్నాథం.

మూడు నెలలు తిరిగాడు దేశమంతా. కాని మనశ్శాంతి కలుగలేదు. సూర్యం పడే కష్టాలను ఊహించుకొని బాధపడుతున్నాడు జగం. తనకు తానే శిక్ష విధించదలచుకొన్నాడు...తాను సూర్యానికి చేసిన అన్యాయం ఫలితంగా తన ఆస్తిలో సగం సూర్యానికి రాసిద్దామనే నిర్ణయంతో తిరిగొచ్చాడు. వెంటనే సూర్యం యింటికి బయలుదేరాడు.

జగన్నాథం సూర్యం యిల్లు చేరేటప్పటికి ఏడుపులు కర్ణకఠోరంగా వినిపిస్తున్నయ్. జగన్నాథం కంపించిపోయాడు. 'సూర్యానికేమన్నా...' ఇక ఊహించలేక వడిగా లోపలికెళ్ళాడు. అక్కడ శవం ఏదీ లేదు. కాని యింట్లో అందరూ దుఃఖంలో మునిగిఉన్నారు. సంగతి అర్థంకాక అక్కడే నిశ్చేష్టుడైనిలబడి "సూర్యం ఏడండీ" అని అడిగాడు.

అక్కడ ముసిలాయన పెద్ద పెట్టున ఏడుస్తూ "అయ్యో ఇంకెక్కడి సూర్యం నాయనా! మాతో చెప్పకుండా యుద్ధంలోకి ఎందు కెళ్ళావురా నాయనా? నిన్ను చూసుకునే కదరా ఇన్నాళ్ళూ బ్రతికింది? ఇంకెవరిని చూసి యిప్పుడు బ్రతకాలిరా?" అని ఆయన హృదయవిదారకంగా విలపిస్తున్నాడు.

జగన్నాథం నిశ్చేష్టుడయ్యాడు.

శర్మ అక్కడే కూర్చున్నాడు. జగన్నాథాన్ని చూడగానే అతనికి పట్టరానంత కోపం వచ్చింది. "ఛీ! దుర్మార్గుడా. ఇంకా యిక్కడి కెందుకు వచ్చావ్? స్నేహితుడవనా? అది ఆ రోజే అయిపోయింది. వాళ్ళిల్లా ఏడుస్తుంటే నీకు సంతోషంగా వుందా! ఆ రోజున నీకు ఎంత చెప్పాను ప్రాధేయపడుతూ! ఛీ! ఛీ!! నీ ముఖం చూస్తేనే పాపం వస్తుంది. ఇక్కడనుంచి వెళ్లు" అని అరిచాడు.

జగన్నాథం జవాబీయలేదు. అక్కడనుంచి కదలనూ లేదు.

"ఇప్పటికైనా సంతృప్తికల్గిందా/ ఇప్పటికైనా తెలిసిందా నీ సత్యవ్రత ఫలితం. సంసారాన్ని పోషించలేక సూర్యం యుద్ధంలోకి వెళ్ళి అక్కడ చనిపోయాడు. !ఛీఛీ! ఇంకా యిక్కడే నుంచున్నావా? బైటికి పోవేం?" అని పట్టరాని కోపంతో జగన్నాథాన్ని బైటికినెట్టి తలుపేశాడు...

★


**కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో**

అనువాదం :

సూరంపూడి సీతారామ్

రెండు భాగములు

ఒక్కొక్క భాగం రు. 3-8-0

ఆంధ్ర గ్రంథమాల, మదరాసు-1,